క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి రోణంకి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రోణంకి గోపాలకృష్ణ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు అందజేశారు.

పీవీజీ రాజుకు ఘన నివాళి



పీవీజీ రాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త, దివంగత పీవీజీ రాజు 28వ వర్ధంతిని మంగళవారం శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఘనంగా నిర్వహించారు. గోశాలలోని పీవీజీ విగ్రహానికి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవస్థానం చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, సూపరింటెండెంట్ సునీల్, అర్చకుడు సంతోష్‌శర్మ పాల్గొన్నారు.

నరవలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌కుమార్

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు నరవలోని భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు. నరవ సర్వే నెంబర్ 338లోని ప్రభుత్వ భూమి(గోర్జ)ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తహసీల్దార్ శ్యామ్‌కుమార్ మంగళవారం ఆక్రమణలను పరిశీలించారు. తక్షణమే ఆయా ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను ఉపేక్షించబోమన్నారు. కబ్జాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలో ఘనంగా వృషభోత్సవం



ఎద్దుకు పూజలు చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం వృషభోత్సవం ఘనంగా జరిగింది. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి గోవులకు పూజలు చేశారు. కార్తీక మాసం మొదటిరోజు శివుడి వాహనం అయిన వృషభాన్ని(ఎద్దు, నందీశ్వరుడిని)పూజించడం పరిపాటి అని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘం నిర్వాహకులు తెలిపారు. భారతీయ సంస్కృతితో విడదీయరాని సంబంధం ఉన్న వృషభం నేడు ప్రాధాన్యాన్ని కోల్పోవడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో రమణమూర్తి, ఏఈ హరి పాల్గొన్నారు.

శివోహం



సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



విజినిగిరిపాలెంలో..



పెందుర్తిలో పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి

పెందుర్తి: కార్తీక మాసం..మహాశివుడు భువికి దిగివచ్చిన కాలంగా చెబుతారు పెద్దలు. ఈ నెలంతా ప్రజలు ఆధ్యాత్మిక చింతనలో ఉంటారు. రోజూ మహాశివునికి పూజలు ఆచరించి శివ కృప పొందుతారు. దీనిలో భాగంగా పవిత్ర కార్తిక మాసోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శివాలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వేకువజాము నుంచి ప్రజలు భక్తిశ్రద్ధలతో మహాశివునికి పూజలు ఆచరించారు. పినగాడి గణేష పార్వతీ సమేత చోడేశ్వర స్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సామూహిక అర్చనలు జరిపారు. సాధుమఠం, శ్రమశక్తినగర్ రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు గణేష్‌నగర్, సుజాతనగర్, కృష్ణరాయపురం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆలయాలు ముస్తాబు...

శతాబ్దం కిందట పెందుర్తి సాధుమఠం వద్ద రామలింగేశ్వరస్వామి వెలిశాడు. స్వయంభూ లింగావతారంలో వెలసిన ఈ శివున్ని కొలిస్తే మంచి జరుగుతుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. పెందుర్తి మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు వచ్చి కార్తీక మాసంలో పూజలు నిర్వహిస్తుంటారు. శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయం, సుజాతనగర్ హరహర క్షేత్రం పెందుర్తి ప్రాంతంలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలు. సబ్బవరం మండలంలోని దేవీపురం కార్తిక మాసోత్సవాలకు ముస్తాబైంది. జిల్లాలోనే ఈ ప్రాంతం వనసమారాధనలకు అత్యంత ప్రసిద్ధి.

సింహాచలం: కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని మంగళవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక శోభను సంతరించుకున్నాయి. సింహగిరిపై ఉన్న శివాలయాలకు తెల్లవారుజాము 5 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. పరమేశ్వరుడికి క్షీరాభిషేకం నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో అర్చకులు రమణమూర్తి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు మంథా సుబ్బారావు శర్మ, కల్యాణ్‌శర్మ ఘనంగా అభిషేకాలు,పూజలు నిర్వహించారు.

- జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలోని శివాలయానికి భక్తులు పోటెత్తారు. పరమేశ్వరడికి తెల్లవారు జాము 4 గంటల నుంచే భక్తులు అభిషేకాలు నిర్వహించారు.
- 98వవార్డు విజినిగిరిపాలెం చంద్రాగార్డెన్స్‌లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ద్వాదశి సోదరుల ఆధ్వర్యంలో పరమేశ్వరుడికి అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆకాశ దీప మహోత్సవాన్ని ఆలయ అర్చకుడు ఉదయ్‌కృష్ణశర్మ నిర్వహించారు.
- కుమ్మరిదిబ్బ, పాత అడవివరం శివాలయాల్లో పరమేశ్వరుడికి అభిషేకాలు,పూజలు చేశారు.
- 98 వార్డు పరిధి సింహపురికాలనీలోని శివాలయంలో కార్తీక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి 6.30గంటల వరకు ఏకవారాభిషేకం నిర్వహించారు. మహిళలు, కాలనీ నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చేయూత



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గొరపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శనను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. వివిధ పథకాల ద్వారా పాడి రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో 62 లేగ దూడలు(పెయ్యిలు)కు నట్టల నివారణ వ్యాక్సిన్ వేశారు. సంస్థ ఉప సంచాలకుడు డాక్టర్ కరుణాకరరావు, డీఎల్‌డీపీ కార్యనిర్వహణాధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు, గోపాలపట్నం సహాయ సంచాలకుడు డాక్టర్ రవికుమార్, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీనివాసరావు, పశువైద్యులు డాక్టర్ సుజాత, డాక్టర్ సుకన్య, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు సీఎం జగన్ అండ

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్‌రాజ్



గుర్రంపాలెంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న అజయ్‌రాజ్, ప్రజాప్రతినిధులు

పెందుర్తి: ప్రతీ గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని..రానున్న ఎన్నికల్లో ప్రతీ ఇంటిపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రతీ ఇంటికీ ఏదో ఒక మేలు జరిందన్నారు. మండలంలోని గుర్రంపాలెం పంచాయతీలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అజయ్‌రాజ్ మాట్లాడుతూ సంక్షేమ పాలనతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైఎస్ జగన్ భరోసా కల్పించారన్నారు. ప్రజా సంకల్పయాత్ర ద్వారా అన్ని వర్గాల కష్టసుఖాలు తెలుసుకుని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారని వెల్లడించారు. ఇంటింటికీ 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, గుర్రంపాలెం సర్పంచ్ ఉగ్గిన దేముడు, పార్టీ నేతలు మధుపాడ అంజి, సారిపల్లి గణేష్ పాల్గొన్నారు.

కనకరాజుకు అయ్యారక సంఘం ప్రతినిధుల బాసట



కనకరాజును పరామర్శిస్తున్న అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘం ప్రతినిధులు

పెందుర్తి: టీడీపీ–జనసేన కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడ్డ అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజును మంగళవారం రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు, ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్షలతో టీడీపీ నాయకులు ఇలా బరితెగించి దాడి చేయడం దుర్మార్గం అన్నారు. అధికారానికి దూరమైన టీడీపీ–జనసేన నాయకులు ఆక్రోశంతో రగిలిపోతున్నారని మండిపడ్డారు. కనకరాజుపై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని..నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ దన్నిన ఈశ్వరవెంకట అప్పారావు, డైరెక్టర్, అయ్యారక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్. ఎస్ పాత్రుడు, సంఘం కార్యదర్శి, కార్పొరేషన్ డైరెక్టర్ లెంక రామున్నపాత్రుడు, సంఘం జాతీయ అధ్యక్షుడు పెదిరెడ్ల రాజశేఖర్, కొత్తవలస వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, కొత్తవలస ఎంపీటీసీ లెంక వరహాలు, విశాఖ, విజయనగరం జిల్లాల అయ్యారక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత అప్పారావుకు ఎమ్మెల్యే పరామర్శ



గొరపల్లి అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొరపల్లి అప్పారావును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. మంగళవారం గొరపల్లిలోని అప్పారావు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గొరపల్లి,గవరపాలెం సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేముడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు మద్దతుగా నిలుద్దాం

ఎంపీపీ బోకం సూర్యకుమారి



సంక్షేమ,అభివృద్ధి పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ,అభివృద్ధి ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి కోరారు. గొటివాడ సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.., పల్లెకు పోదాం కార్యక్రమాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సాలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అండగా దండగా నిలుస్తున్నారన్నారు. దేశ చరిత్రలోనే ఇటు వంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకూ చూడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామంలో సుమారు రూ.26.02 కోట్లతో పలు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సంక్షేమ,అభివృద్ధి పథకాల పట్టికను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,ఐడీ బాబు,ఈవోఆర్డీ మహేష్, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎన్ఆర్ఐ వెంకటరమణ

సబ్బవరం: మండలంలోని వంగలిలో ఆలయాల నిర్మాణానికి టెక్కలిపాలెం గ్రామ సర్పంచ్ గొంప నాయనప్ప కుమారుడు, ఎన్ఆర్ఐ గొంప వెంకటరమణ రూ.1.50 లక్షలు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. బొర్రాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ. లక్ష, శ్రీ సీతారాముల ఆలయ మండపంపై సూర్యరథం నిర్మాణానికి రూ.50 వేలు అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యర్రా శ్రీనివాసరావు, నాయకులు గవర రాజు,మాజీ ఎంపీటీసీ పైల రమణ,మాజీ సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

'వై ఏపీ నీడ్స్ జగన్'పై విస్తృత అవగాహన



'వై ఏపీ నీడ్స్ జగన్'పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పార్టీ నేతలు

పరవాడ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు అన్నారు. గొర్లివానిపాలెం లో మంగళవారం' వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామంలో గడపగడపకు పర్యటించి రాష్ట్రానికి జగన్ ఎందుకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న దానిపై ప్రజల నుంచి సమాధానాలు రాబట్టారు. గత చంద్రబాబు పాలనకు నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు వ్యత్యాసాన్ని వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కె.భాస్కర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రసాద్ పథకం పనులకు క్లియరెన్స్

సింహగిరిపై షెడ్ తొలగింపు



సింహగిరిపై షెడ్ తొలగిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా స్థలాలు క్లియర్ చేసి ఇచ్చే పనులకు దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టారు. సింహగిరిపై ఆధునిక క్యూ కాంప్లెక్స్ నిర్మాణ కోసం త్రిపురాంతకస్వామి ఆలయానికి సమీపంలోని షెడ్ తొలగిస్తున్నారు. అలాగే కొండదిగువ వరాహ పుష్కరిణి సత్రాన్ని కూడా మరికొద్ది రోజుల్లో తొలగించనున్నారు. ఈమేరకు అధికారులు పుష్కరిణి వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. పుష్కరిణి స్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.5 కోట్ల ప్రసాద్ స్కీమ్ నిధులతో ఆధునిక హంగులతో ప్రిలిగ్రిమ్స్ ఎమినిటీ సెంటర్ నిర్మించనున్నారు. ఇదిలావుండగా స్వామివారి డోలోత్సవం జరిగే మండపం పురాతనమైంది కావడంతో తొలగించకూడదని నిర్ణయం తీసుకున్నారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు కాల్స్

గోపాలపట్నం: ప్రయాణికుల సూచనలు, సలహాలు స్వీకరించడానికి మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఆర్ఎం కార్యక్రమానికి ఐదు ఫోన్ కాల్స్ వచ్చాయని డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. పలువురు విలువైన సూచనలు, సలహాలు తెలియజేశారన్నారు. వచ్చిన కాల్స్ ఇవీ..

- ఐ. నారాయణరావు అనే వ్యక్తి కొత్తవలస నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు బస్సు నడపాలని కోరారు.
- మద్దిలపాలెం నుంచి సింహాచలం కొండపైకి మెట్రోసర్వీస్ నడిపితే బాగుంటుందని అప్పన్న అనే వ్యక్తి సలహా ఇచ్చారు.
- పి. ప్రవీణ్ కుమార్ ఆరిలోవ నుంచి సింహాచలం వెళ్లేందుకు బస్సుసౌకర్యం కల్పించాలని కోరారు.
- కొత్త వలస నుంచి పాతపోస్టాఫీస్ వరకు సర్వీసు నడపాలని రామకృష్ణ కోరారు.
- దొండపర్తి బస్టాప్‌లో బస్సులు సరిగా ఆపడం లేదని ఆర్. వెంకటరావు తెలిపారు.

వీటిని పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం పేర్కొన్నారు.

గ్రంథాలయాలు...విజ్ఞాన నిలయాలు



అడవివరం గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసింహం తదితరులు



చాచా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెద్దలు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు

సింహాచలం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని అడవివరం శాఖా గ్రంథాలయాధికారి ఏవీ నరసింహం అన్నారు. గ్రంథాలయంలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత మాజీ ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసిశెట్టి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కోరాడ సీతారామ్మూర్తి, కార్మిక నేత సీహెచ్.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు అని సబ్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి ఆసారి తాత అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ బాటలో ప్రతీ ఒక్కరూ నడవాలన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ బుధవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఉందన్నారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ పెంకటశెట్టి భూలోక, కార్యదర్శి ఆదారి రామకృష్ణ, కోశాధికారి పెంటకోటి గణేష్, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యం మాస్టారు, జానకీరామారావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

పరవాడలో..

పరవాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను ఉక్కు సాహిత్య సమైఖ్య అధ్యక్షుడు కేవీ రామారావు, గ్రంథాలయాధికారి కేవీ లక్ష్మణరావు ప్రారంభించారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

సబ్బవరం: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తహసీల్దార్ బి. సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రంథాయల అధికారి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి,ఆలీవ వీరయ్య, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, ఎంపీటీసీ పాత కాల ఉపాధ్యాయులు నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బాలల దినోత్సవం

చాచా నెహ్రూకు ఘన నివాళి



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, తదితరులు



చిన్నారులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ పూజాశేఖర్

పెందుర్తి: బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో జరిగిన వేడుకల్లో జీఎం కె.రమ్య మాట్లాడుతూ విద్యార్థులంతా భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి వెంకటేష, సీజీఎం వసంత, ప్రిన్సిపాల్ స్వరూప పాల్గొన్నారు. సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో విద్యార్థులు నృత్యాలు, నాటికలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవితదితరులు చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సబ్బవరంలో..

సబ్బవరం: పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలతో పాటు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలలు వివిధ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి బహుమతులు అందజేశారు.